కథానిక

# అభ్యుదయకాముకుడు

"పరంధామయ్య"

రాత్రి పొద్దుపోయింది. చీకటి దట్టంగా వ్యాపించింది. పల్చటి మబ్బు తెరల చాటున చుక్కలు మినుకు మినుకు మంటున్నయ్. ఆ నక్షత్రకాంతైనా జొరబడని మట్టిగోడల పూరిగుడిశెల్లో వందలాది జనం తమ జీవిత పోరాటాన్ని తాత్కాలికంగా ఆపి నిద్రలో మునిగిపోయారు. ఆ గుడిశెల మధ్యనే వున్న కొండయ్య యింట్లో మాత్రం యింకా దీపం వెలుగుతూనే వుంది. పిల్లలు ఒకమూల చినిగిన చాపపైబడి దొర్లాడుతున్నారు. వారి పక్కనే వెలిగే కిరసనాయిలు బుడ్డి తాలూకు పొగ, వారి ఉచ్ఛ్వాస నిశ్వాసములను అనుసరిస్తూ నీలితెరలను సృష్టిస్తోంది. కొండయ్య మూల్గుతున్న భార్యను గదమాయిస్తూ—

"ఎప్పుడూ గొడ్డుమూల్గినట్టు, ఎడతెరిపిలేదు. పగలు నడుములు విరిగేట్లుపనిచేయటం, రాత్రుళ్ళ నీ మూలుగు వింటూ తెల్లార్చుకోటం."

"మూలగాలని నాకు యిష్టమా యేమిటి, వెన్నులో ఒకటేపోటు, యిస్ అబ్బా! అబ్బాయి రాలేదుకదూ."

"వాడెందుకొస్తాడే. నీ పిచ్చిగాని, దేశోద్ధారకుడైపోయెనే. అమ్మా-అబ్బా ఎట్లా చస్తే వాడికేం!"

"అమ్మాయి పెండ్లిసంగతి చెప్పారుకదూ."

"చెప్పాను. నీ జబ్బుసంగతికూడా చెప్పాను. కొంపలో జరగటం కష్టంగా వుందనీ, రోళ్ళ సుబ్బయ్య రోజూ కొంపమీదికొచ్చి నానా మాటలంటున్నాడని చెప్పాను. నీవు జేసిపోతివి గదరా అప్పు, అదైనా సమాళించరా అన్నాను."

"అబ్బా, చెప్పండి. ఏమన్నాడూ? యిస్"

"నేనొస్తాను యెల్లుండి-పొమ్మన్నాడు. ఈ రోజు రావాల్సింది. యింకేమొస్తాడు. వాడికి మనం జ్ఞాపకంవున్నాంగనకనా. వాడిదేశమేమో, వాడి ప్రజలేమో. వాటి ధోరణే వాడిది. ఇంట్లో మహా యిబ్బందిగా వుందిరా అంటే, ఏమన్నాడనుకొన్నావ్? మనింట్లోనేగాదు—యీ దేశంలో సగానికిపైగావున్న కొంపల్లో అంతా యింతకంటె అధ్వాన్నముగా ఉన్నారులే అన్నాడు. నీవు చేసిన బాకీ అన్నాకట్టరా అంటే, కట్టాము లేవయ్యా, దోచుకున్న సొమ్ము ఎగేశినా పరవా లేదులే అన్నాడు. నేనుగదట్రా యిరుకొక్కని వుండేది, వాళ్ళు అనరాని మాటలంటున్నారు, అని అంటే, సరే యెల్లుండి నేనొస్తాను పో అన్నాడు."

"అన్నిసరే. అమ్మాయి పెండ్లిసంగతి చెపితే ఏమన్నాడు?"

"ఏమంటాడే నీదంతా పిచ్చి. ఇప్పుడేం తొందర అన్నాడు."

"ఏంతొందర అన్నాడా ఎదిగినబిడ్డ ఇంట్లో వుంటే"

"అన్నాడే-అంటాడు. యిప్పుడు వాడికి అమ్మని, అబ్బని, అక్కని, చెల్లెలని, లేదు. ఎంత సేపటికీ ప్రజలూ, దేశమూ. కొంపనుద్ధరించలేని వాడు, దేశాన్నేం వుద్ధరిస్తాడో?"

ఇంతలో వీధిలోని కుక్కలు మొరిగినయి. సైకిలువచ్చి యింటిముందు ఆగిన ఛప్పుడైంది.

"అబ్బాయి వచ్చినట్టుంది" కొండయ్య లేచి వాకిలి తలుపు తెరిచాడు. పందికొక్కు గోరపెడుతూ వాకిలిగుండా బయటికి వుడాయించింది. కొండయ్య అదిరిపడి, "దీని తస్సాదియ్యా, పందికొక్కు" అన్నాడు. "ఏం పందికొక్కా?" అంటూ సైకిలును యింటి గోడకానించాడు కొండయ్య కొడుకు చిన్నయ్య.

"ఆ, తలుపులు తీసేటప్పటికి బయటికి దూకింది. గోడంతా తూట్లుపడిపోయినయ్ వీటి దెబ్బ. పొద్దుపోయిందే" అంటూ చుట్ట ముట్టించాడు కొండయ్య.

"గుళ్ళపాలెంలో మీటింగొకటుంటే అటు పోయి వస్తున్నా. అమ్మేది" అంటూ యింట్లో జొరబడ్డాడు.

"ఏమిరా నాయనా, నేను చచ్చినా యింతే కదూ!"

"ఏంజేసేది. నాకు తీరిక వుంటేగా" అంటూ కూలబడ్డాడు.

"నన్ను చూడటానికే నీకు తీరికలేదటరా?"

"మొన్న నాయన చెప్పాడు, మళ్ళా నీకు జబ్బు చేసిందని. అప్పుడే రావాలనుకున్నానుగాని ఎగువపాడులో భూస్వాములకు, కూలీలకు తగాదా ఏర్పడితే, అర్జంటుగా పోవలసివుండి పోయాను. ఏంజేస్తాం! ఈ సమాజంలో మనమే కాదు. ఎందరో యీమాదిరి జబ్బుల్తో బాధపడుతున్నారు. కూటికిలేక అల్లాడుతున్నారు. అప్పుల భారంతో కుంగిపోతున్నారు. రెక్కలాడినా డొక్కలునిండటంలేదు. ఇది చాలా అన్యాయం! కష్టజీవులకు కనీవిని యెరుగని కడగండ్లు, సోమరిపోతులైన ధనాఢ్యులకు అనంతభోగవిలాసాలు. ఇది మారాలి. దానికోసమే మేము తీవ్రంగా కృషిచేస్తున్నాం."

"ఇక చాలించరా అబ్బాయ్. జడివానలాగ లంకించుకున్నావ్. వున్న కాస్త వూపిరి గుటుక్కుమనేట్టుంది. యిస్ అబ్బా"

"ఏమిటమ్మా, అలా అంటావ్!"

"పోటురా! వెన్నెంతా విరగ్గొట్టినట్టు! ఇక్కడేం కొంపలో పడే అగచాట్లేంది, గంట కొట్టినట్టు అలా వాగుతావేమిరా?"

"ఈ సమాజంలో యిది తప్పనిసరి, అగచాట్లు, కష్టాలు, బాధలుపడే ప్రజానీకం దినదినానికి వృద్ధి అయిపోయింది. వొక్కుమ్మడి తిరగబడటానికి సన్నద్ధమవుతోంది. యీ ధన మదాంధుల దౌష్ట్యం త్వరలోనే అంతమవుతుంది. మధ్యయుగపునాటి యీ అధ్వాన్నపు ఆర్థిక వ్యవస్థ విరిగి తుత్తునియలు కాబోతుంది."

"నీకెంతైనా పుణ్యముంటుంది. ధోరణి చాలించరా బాబూ."

"బాధగా వుందాయేం అమ్మా! రోగాల్తో బాధపడే ప్రజానీకం, కష్టాల్తో సతమతమయ్యే ప్రజానీకం యుగయుగాంనుండి, తరతరాలనుంచి, దాస్యంలో మునిగి, బాధలతో కుళ్ళి యిప్పుడే కన్ను తెరిచారు. ఆవులించి మేల్కొన్నారు. పిడికిలిబిగించి నిల్చోబోతున్నారు. ఆ దెబ్బకు లోకాలన్నీ దద్దిరిల్లి పోతున్నాయి."

"నీ కేకలికి పిల్లలెక్కడ లేస్తారో! ఏం వాగుడురా నీది! అబ్బా! వెన్ను విరిగిపోతోంది" మూల్గుతుంది.

"నీవేకాదు. పీడిత ఆసియా అంతా నేడిట్లే మూల్గుతోంది. బ్రతుకు భారమైన ప్రజలు, జీవితమే బాధ అనుకున్న ప్రజలు నేడేకాదు యుగయుగాలనుంచి మూల్గుతున్నారు—"

"ఇదేం గ్రహచారంరా బాబూ, నాకర్మ కొద్దీ అబ్బా..." పెద్దగా మూలుగుతుంది.

"కర్మని-గ్రహచారమని మానవుల దోచుకునే స్వార్థపరత్వం మానవులను దానవులనుగా జేసే క్రూరత్వం యీ సమాజంలో వుంది. మతం మత్తుతో నవకాళీ దురంతాలు పూర్వజన్మ సుకృతం పేరుతో తోడిమానవుల రక్తం పిండటం నేటికాలపు న్యాయం—"

"నోర్మూయ్—" ఇక భరించలేక గట్టిగా అరిచాడు కొండయ్య ఆరినచుట్ట పారేస్తూ.

చిన్నయ్య నిర్ఘాంతపోతూ "ఐ నెవర్ ఎక్స్పెక్ట్—" అన్నాడు.

"ఆ కూతలుకూడా నేర్చుకొన్నావ్—"

"నేర్చుకొన్నా. అయితే మీ ధర్మానకాదు ప్రభుత్వం ధర్మాన సంవత్సరంనర జైలులో వున్నాగా—"

"నీవా జైల్లోనన్నా వుంటే మాకీ అప్పుల బాధ లేకుండా పొయ్యేది. ఏమో వుద్ధరిస్తావని ప్లీడర్ల చుట్టూ కోర్టులచుట్టూ తిరిగి నిన్ను విడిపించుకొని వచ్చాం. తగ్గట్టే చేశావ్—"

"ఏం జేశాను—"

"ఇంకా ఏం జేయాలిరా? రేపో మాపో కొంప ఏలాం వేస్తుంటేను—"

"అంత తేరకే. ఎవరికున్నాయ్ అన్ని గుండెలు—"

"ఆ భాగ్యానికి గుండెలెందుకురా? రోశ్శ సుబ్బయ్య నీ ధర్మమా అంటూ దావా జేశాడు. డిక్రీకూడా అయిపోయింది. డబ్బియ్యకపోతే వేలాం వేయక నిన్నుజూచి భయపడతారనుకున్నావా?"

"సరే. వేలాం వేయటానికే రానీ అప్పుడే కట్టేస్తాం—"

"కట్టడానికి డబ్బు నీదగ్గ రేమన్నా—"

"నాదగ్గ రెక్కడుంది—"

"లేకపోతే బాకీలుచేసి ఎందుకు నూకెళ్లావ్? ఇక్కడ పనిజేసి తీరుస్తానని వందా యాభై జేస్తివే? ఎలెక్షనులో నే నేదో వోరగ బెట్టాల లేకుంటే ప్రపంచమే మునిగిపోద్దని వెళ్లివి. ఆ వెళ్ళటం వెళ్ళటం మరలా ముఖం చూపకపోతివి. ఇంట్లో జూస్తే మీఅమ్మ కిట్టుండే. మందిప్పించ టానికి దోవా గతి గనబడకపోయె. నే నొక్కణ్ణి ఎంత వొళ్ళిరుసుకుంటే మాత్రం తిండికే చాలక పోయెనే - అవిగో ఆ ఏదుం వడ్లు అమ్మాయి పెండ్లికని యెత్తిపెట్టాం. బండెడుకష్టం జేస్తున్నా ఎద్దులకు వులవలు వెయ్యటంలేదు. అవి చిక్కి సగమైపోయినయి. ఇంట్లో తిప్పలు యీవిధంగా వుండె, అమ్మాయి పెండ్లి అనుకుంటూ వుంటిమి. ఇట్టా నేను మునగానాం తేలానాంగా వుంటే నీపాటికి నువ్వు నూకెళ్ళి నీవుచేసిన అప్పు కూడా మా నెత్తినవేస్తే మే మేవిధంగా కట్టి యేడవాలని? ఏవిధంగా యీ కుటుంబపోషణ జరగాలి?"

"అయితే నన్నేం చేయమంటావు—"

"నాలుగునెలలపాటు యిక్కడుండి పనిచేసి, ఆ అప్పు తీర్చేసి నీపాటికి నీ వెటువెళ్ళినా మాకు అభ్యంతరంలేదు. ఇక వుండేది ఆ పిల్లలు-మేము అమ్మాయికి యీలోగా పెళ్ళి ఏలాగో చేసేస్తాం. అవతల వుంటే తింటాం లేకుంటే వురిపోసుక చస్తాం—"

"నాలుగునెలలే! సాధ్యంకాదు."

"ఏం అంత మునిగిపొయ్యేపని ఏముందిరా?"

"ఎంతచెప్పినా మీరు నన్ను అర్థం చేసు కోటంలేదు. నాలుగునెలలుగాదు నాలుగు వారాలుండినా వుద్యమం ఎంత బలహీన మవుతుందో అదెంత ప్రమాదకరమో మీకేం తెలుస్తుంది."

"ఇంత జెప్పినా నీకా తలతిక్క వదల లేదన్నమాట."

"సరే. రేపా రోళ్ళ సుబ్బయ్యకి నచ్చజెప్పి వెళతాగా-ఇంతకు అమ్మాయిని జూడవచ్చేవాళ్లు-"

"ఇంతకుముందు కలికిపల్లెనుంచి వచ్చినారే వాళ్ళే—"

"ఇంతకూ అమ్మాయి మేల్కొని వుందా? ఉంటే యింతసేపు పలక్కుండా వుండదే—"

"మీ కేకలికి నిద్రకూడానా" అమ్మాయి నవ్వుతూ అంది.

"అయితే వచ్చి గంటైనా పలకరించలేదేమి అమ్మాయి."

"నీవు ఉపన్యాసాలకి లంకించుకోటం అమ్మ లబో యని ఏడవటం నాన్న నీకు రెండు వడ్డించ టం అన్నీ వి టూనేవున్నా—"

"సరే యిక పదుండండి కోడికూడ కూసి నట్టుంది. పొద్దున్నే ఆరోళ్ళ సుబ్బయ్యకు చెప్పి పోవయ్యా!"

"రోళ్ళ సుబ్బయ్యదగ్గరికి యీయన పో బని లేదు. ఆయనే యిక్కడికి వేకువఝామున వచ్చి పడతాడు చూడండి—"

* * *

చిన్నయ్య వచ్చాడన్న విషయం తెలిసి, పొద్దున్నే రోళ్ల సుబ్బయ్య కొండయ్య యింటి ముందు ప్రత్యక్షమైనాడు. నున్నని అతని బట్ట తలపై బాలభానుని లేతకిరణాలు పడి తళుక్కు మంటున్నాయ్. అప్పుమొత్తం డిక్రీ అయిందని, ఆరోజు డబ్బు కడితే కట్టితే కట్టినట్లు లేకుంటే జప్తు చేయిస్తానని కేకలేస్తున్నాడు. ఆ కేకలికి చుట్టుప్రక్కల నివసించే జనాభా అంతా అక్కడ పోగైనా, చిన్నయ్యకు మాత్రం నిద్రాభంగం కలిగించలేకపోయింది. అతడు కుక్కి మంచంపై కాళ్లు పొట్టలోకి ముడుచుకొని సుఖముగా నిద్రపోతున్నాడు. పిల్లలు దిసమొలతో వీధినిబడ్డ పేడ మీదికి లంఘించి, చేతులతో తీసుకొచ్చి దాంతో ఆటాడుతున్నారు.

"అమ్మాయ్ వాణ్ణి లేవగొట్టమ్మా, పొద్దు నెత్తిమీదికొచ్చింది." కొండయ్య నీళ్లు చేదే కూతురుతో అన్నాడు.

ఇంతలో చిన్నయ్య కళ్లు నులుముకుంటూ వచ్చి "ఏం సుబ్బయ్యా! గొంతుచించుకుంటూ వున్నావే?" అన్నాడు.

"అంతా నీచేతి చలవే నాయనా! యీ పాడు బాకీ యేమని పెట్టానో, తిరిగి తిరిగి నా కాళ్ళు అరిగిపోతున్నాయ్. నేనేం వున్నవాణ్ణి గనుకనా! అప్పుడు పది, అప్పుడు యిరవై సామాను తీసుకొని నా కొంప ముంచేశారు. ఏదో ఆ వ్యాపా

త్రంమీద నేను నా బిడ్డలు బతకాల్సినవాళ్ళం. రూపాయి డబ్బులుంటే వస్తువు తెచ్చుకోని, అణో, బేడో సంపాయించుకునేవాణ్ణి. మీ తాతాత్కార్యం నాకెక్కడ సరిపోద్ది, రెండు సంవత్సరాలు వెళ్ళిపోయినయ్."

"ఎన్నాళ్లు జరిగితే యేం. వడ్డీ యిస్తున్నాంగా?"

"వడ్డీ కాసుల కాశపడి- అసలుకు మోసం తెచ్చుకో మంటావా?"

"ఎగేసినట్టు మాట్లాడుతుండావే?"

"మాటలతో పనేందుకు కాని, నా డబ్బు యిటు నా మొహాన పారెయ్యండి. అక్కడ బాకీలోళ్ళు నా గొంతుమీద కూసొని నన్ను నానా తిట్లు తిడుతున్నారు."

"ఉన్నప్పుడు యిస్తాం-పో."

"ఆ దబాయింపులకి దడుసుకొనేవాణ్ణికాదు. ఎల్లుండి మధ్యాహ్నంలోగా నా బాకీ సెటిలు చేయకపోతే, అది అగబెమ్మదులొచ్చినా ఇక ఆపటం వీలుకాదు. నన్ను గూటించే వాళ్ళెందరో నీకేం తెలుసు."

"సరే, యెల్లుండిస్తాం పో."

"ఏం కొండయ్యా! నీకొడుకు ఎల్లుండిస్తానని చెపుతున్నాడు. ఎల్లుండిస్తే ఇచ్చినట్లు, లేకుంటే నాదేం తప్పులేదు. బాకీ డిక్రీ కూడా అయివుంది." అంటూ బట్టతల తడుముకుంటూ సుబ్బయ్య వెళ్ళాడు.

"ఎల్లుండి లోపల సమాళించ గలవూ?"

"ఏఁగాగో చక్కచేయకపోతే యెట్లా. నేనిక వస్తాగాని—"

"అమ్మాయిని ఈవేళ చూడొస్తుంటే పోవాలంటావేం?" చిన్నయ్య తల్లి తలుపు కానుకొని కూర్చుంటూ అన్నది.

"ఎల్లుండికి పైకం సమాళించాలిగా-అయినా నేనెందుకు, మీరే కుదుర్చు కొండి. వాళ్లు నగలేమన్నా పెడతామన్నారా అమ్మాయికి?"

"నగలకి, కోకలకి అయిదు వందలు యిస్తామన్నారురా అబ్బాయి! పెళ్ళి మాత్రం మనం చేయాలి. మన అమ్మాయి కొంచెం బాగుంటుందని, అదికూడా గాక బతికిచెడిన కొంపకాదురా మనది! అందువల్ల మనమేమీ పెట్టకపోయినా వాళ్ళే యింత పెట్టి చేసుకుంటున్నారు."

"సరే! నేనెల్లుండిపొద్దున్నే వస్తా" చిన్నయ్య వెళ్ళిపోయాడు. ఆరోజు మధ్యాహ్నమే పెండ్లి వారు వచ్చారు. సంబంధం కుదిరిపోయింది. మూడోనాడు పండ్లు, పువ్వులు తెచ్చి పిల్ల మాదనుకొని పోతామని చెప్పిపోయారు.

* * *

సుబ్బయ్యకు చెప్పిన ఎల్లుండి గడువు గడచిపోయింది. కొండయ్య దిగులుగా ఉన్నాడు. అతని భార్యకు జబ్బు మరీ జాస్తయింది పెళ్లి వారు పళ్ళూ, పువ్వులూ తీసుకొని పక్కింట్లో దిగి ఉన్నారు. ఇంట్లో వారంతా చిన్నయ్య కోసం ఎదురు చూస్తున్నారు. కొండయ్య పందిరిలో కూర్చొని చుట్ట తాగుతున్నాడు. భార్య తిండికి లేవమన్నా, కూతురు నీళ్ళు తెచ్చి పెట్టినా కొండయ్య లేవలేదు. చుట్ట అఖరయిపోగా దాన్ని పారేసి లేచి చెంబు అందుకోబోయాడు. ఇంతలో వీధినుంచి సుబ్బయ్య అమీనాతో రావడం చూశాడు. చెంబు కిందబడింది. కొండయ్యకు గుండె వేగంగా కొట్టుకుంది. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. క్షణంలో కొండయ్య యింటి ముందు అసంఖ్యాక ప్రజానీకం ఎండ చుర్రుమంటున్నా పోగుపడ్డారు. సుబ్బయ్య వెనక పందిట్లో జొరబడి అమీనా కాగితాలకట్ట విప్పాడు. కొండయ్యకు జీవనాధారమైన ఎద్దులు, యింట్లో వున్న యేదుం వస్లు జప్తు చేయబడినవి. కొండయ్య భారమైన హృదయంతో ఆలాగే కూలిపోయాడు. అతని భార్య మూలుగు మరీ జాస్తయింది

పెళ్ళి వారికిది అశుభంగా తోచి వచ్చిన దోవనే వెళ్లిపోయారు.

చిన్నయ్య ఆ సాయంత్రమే ఆ వూళ్ళో ఒక బహిరంగ సభ ఏర్పాటుచేసి సుబ్బయ్య నిరంకుశ చర్యను గురించి గర్జిస్తూ గంభీరోపన్యాసం చేసి తన బాధ్యతను నెరవేర్చుకున్నాడు.

'అనుభవం'అని పెద్దలనేదానికి మనం ఏమంత నైతికవిలువ ఆపాదించనక్కరలేదు. తరుచు వాళ్ళు చేసిన పొరపాట్లనే అనుభవం అనే మారుపేరుతో పిలుస్తారు.

—ఆస్కార్ వైల్డ్